# మరో రచయిత పుట్టాడు !

ఒకరోజు 'గన్' ఎదురయ్యాడు నాకు.

"ఏమిటి సంగతి? చేతిలో పుస్తకం ఏమిటి? ఏదైనా చందాలు వసూలు చేస్తున్నావా?" అని అడిగాను.

ఆ మాటలకు 'గన్' పురుగును ముట్టుకుంటే ముడుచుకుపోయినట్లుగా అదోలా అయిపోయి–

"అదికాదు గురువు గారూ! అసలు రచయితలంటే మన ఆంధ్రదేశంలో లోకువ అయిపోయిందండీ! ఇదే మరో రాష్ట్రంలో అయితే యువ రచయితను కూడా ఎంతో ప్రోత్సహిస్తారు..." అంటూ ఆవేశంగా చెప్పుకుపోతున్నాడు.

ఏమిటో... రిక్షా ఎక్కగానే 'గురువుగారూ– ఎక్కడికి పోనియ్యమంటారు?' అంటాడు రిక్షావాడు–

హోటల్‌కి వెళ్లగానే సర్వర్– 'గురువుగారూ... ఏమివ్వమంటారు?' అంటాడు–

... ఈ 'గురువు గారూ...' అన్న పదానికి అసలు విలువ పోయి గురువుగారికే పంగనామాలు పెట్టే రోజులు వచ్చేశాయి.

మౌనంగా వున్న నన్ను–

"ఏంటి గురువుగారూ... ఆలోచిస్తున్నారు?" అడిగాడు గన్.

"అవును నాగేంద్రరావూ... నువ్వు రచయితవి ఎప్పుడు అయ్యావు?" అన్నాడు.

"భలేవారండీ! మొన్న అస్సాం నుండి వెలువడే తెలుగుసాహిత్య పత్రికలో నా ఉత్తరం పడింది... చూడలేదా?" అంటూ వెంటనే జేబులోంచి ఒక చిన్న బుక్‌లెట్ తీశాడు.

ఆ 'పత్రికా రాజం' నాలుగు పేజీలు ఉంది. ఎఱ్ఱని అక్షరాలతో 'యువరక్తం' అని పేరు ఉంది. ఆ పత్రిక రెండో పేజీలో– "అయ్యా! మీ 'యువరక్తం' పత్రిక చూశాను. చాలా సంతోషం! తెలుగు పత్రికారంగంలో 'నభూతో నభవిష్యతి.' ప్రతి పేజీలో ప్రచురించబడిన రచనలు వాటికవే సాటి – ఇట్లు..."

ఆ ఉత్తరం చుట్టూ రెడ్‌కలర్ స్కెచ్‌పెన్‌తో బోర్డర్ గీశాడు గన్.

'నేను ఆ ఉత్తరం చదివి ఏం చేస్తానా...' అని ఆత్రుతగా చూస్తూ, ఆ ఉత్తరం చూసిన వెంటనే నేను అతన్ని కౌగిలించుకుంటానేమోననే భ్రమతో– ఒకవేళ అదే జరిగి నేను కౌగలించుకుంటే... తట్టుకునే ఏర్పాటులో సిద్ధంగా వున్నాడు గన్.

ఆంధ్రప్రదేశ్‌లో రచనలు చేస్తూ... తమ రచనలు స్వంతంగా ప్రచురించుకునే రచయితలు గాని, లేదా పత్రికలలో తరచుగా తమ రచనలు ప్రచురించబడే రచయితలు గాని- సుమారు ఓ వెయ్యిమంది దాకా వున్నారని మేధావుల అంచనా! అయితే వారిలో మరో రచయిత చేరాడన్నమాట!!

అతనే... మా గన్ !!

'గన్' అతని కలం పేరు.

'గన్' అంటే- 'ఇదేమిటీ... పేరు ఇంత భయంకరంగా ఉందీ!' అని భయపడిపోకండి.

ఈ కలం పేరు అతని పూర్తిపేరులోంచి అద్భుతంగా పుట్టింది.

అతని పేరు... 'గుంటూరు నాగేంద్రరావు.'

ఇంటిపేరులో 'జి.యు.', అసలు పేరులోని 'ఎన్' కలిపి అతివీర భయంకరంగా 'గన్' అనే కలంపేరుతో రచనావ్యాసంగం మొదలుపెట్టాడన్న మాటే!

ఆలోచనల్లోంచి బయటపడి "చాలా బాగుంది గన్!" అన్నాను.

నన్ను వెంటనే కౌగలించుకున్నంత పనిచేసి ఆ పత్రిక మడతపెట్టి, తన ఉత్తరం కనపడేట్లుగా చొక్కా జేబులో పెట్టుకుని-

"పదండి గురువుగారూ... కాఫీ తాగుదాం!" అంటూ నన్ను కేంటీన్ లోకి లాక్కుపోయాడు.

నాకు ఇష్టమని గులాబ్‌జామూన్ తెప్పించాడు.

నేను సదరు గులాబ్‌జామూన్స్ తినేలోపుగా- 'అసలు ఉత్తరాలు ఎలా రాయాలి? సాహిత్యంలో పైకి రావాలంటే ఎవరెవరు ముందు ఉత్తరాల రచయితలై, తరువాత ప్రముఖ రచయితలయ్యారు? అసలు ఉత్తరాలు వ్రాయడంలో టెక్నిక్ ఎలా ఉంటుంది?' లాంటి విషయాలన్నీ ఏకరువు పెట్టసాగాడు.

'ఇక నీ సుత్తి ఆపురా బాబూ!' అని అందామని అనుకుంటుండగా-

గన్‌ని ఎవరో పలకరించి, నన్ను రక్షించారు.

ఆ పలకరించిన వ్యక్తితో వెళ్లిపోతూ "గురువుగారూ... బిల్ పే చేశాను. వెళ్లేటప్పుడు కారప్పూస, కాఫీ కూడా తాగి వెళ్లండి!" అంటూ వెళ్లిపోయాడు.

●

సంవత్సరాలు గడుస్తున్నాయి...

మా 'గన్' త్వరలోనే ఒక 'ప్రముఖ ఉత్తరాల రచయిత' అయిపోయాడు. అప్పుడప్పుడు చిన్న చిన్న కవితలు కూడా పత్రికల్లో అచ్చయ్యాయి.

ఒకరోజు 'గన్' తనవెంట ఎవరో తరుముకొస్తున్నట్లుగా వచ్చాడు నా దగ్గరకు.

"గన్... ఏమిటి విశేషం?"

దానికి నోట్లోంచి చిరుజల్లు పడ్డట్లుగా నవ్వి-

"గురువుగారూ! అసలు విషయం ఏమిటంటే... మీ ఆశీస్సులతో నేను ఉత్తరాల రచయితగా స్థిరపడ్డాను. అస్సాం, బెర్హంపూర్, ఒరిస్సా, ఢిల్లీ మొదలైన పట్టణాల నుండి

వెలువడే సాహిత్య పత్రికలలోనే గాక, మన రాష్ట్రంలో వార, పక్ష, మాస, ద్వైమాస, త్రైమాస, ద్వైవర్ష, త్రైవర్ష పత్రికల్లో ఇంతవరకూ నా ఉత్తరాలు వంద పైనే ప్రచురించబడ్డాయి. రెండు మూడు ఉత్తరాలకు బహుమతి కూడా వచ్చింది.

ఈ శుభ సందర్భంలో స్థానిక 'యువరసం' వాళ్ళు నాకు సన్మానం చేసి 'ఉత్తరశ్రీ' అని బిరుదు ఇస్తామన్నారు. ఖర్చులకు కావాలంటే లోపాయికారీగా కొంత డబ్బు ఇచ్చాన్లెండి. ఈ సంగతి మాత్రం ఎవరికీ చెప్పకండి!" అన్నాడు కంగారుగా.

"సర్లే... నీకూ, వాళ్ళకూ ఆమోదకరమైన 'ఒప్పందం' కుదిరినప్పుడు మధ్యలో నాకెందుకు అభ్యంతరం? ఇలాంటివి మన ఆంధ్రదేశంలో మామూలేగా! ఇంతకీ... నన్నేం చేయమంటావ్ గన్?" అన్నాను.

అప్పుడు చెప్పాడు అసలు విషయం...

"ఆ సభలో మీరు నా గురించి మాట్లాడాలి. నా మొదటి ఉత్తరం అస్సాం పత్రికలో పడినప్పుడు మీ అభినందన స్ఫూర్తితో నేను ఇంతటివాడినయ్యాను."

●

ఆరోజు 'గన్' సన్మాన సభ!

ఎక్కడ సంపాదించారో గాని- పాత కార్డులు, ఇన్‌లాండ్ లెటర్లూ... అన్నీ ఒక టేప్‌కి కుట్టించి అవే తోరణాలుగా కట్టారు సభావేదిక పైన. సన్మానపందిరి నిండా ఉత్తరాల తోరణాలే!

అద్భుతమైన ఆలోచన!

'ఉత్తరాల రచయితకు సన్మానం' అంటే మాటలా మరి!!

ముందుగా 'గన్'ని పిలిచారు.

పూలదండ వేశారు.

ఆ వెంటనే వెయ్యి కొత్తకార్డులతో తయారుచేసిన దండ మెడలో వేశారు.

సన్మాన సంఘ అధ్యక్షులు ఉపన్యాసం మొదలుపెట్టాడు...

"సాహితీ బంధువులారా! 'గన్' అంటే... గుంటూరు నాగేంద్రరావుగారు- ఇంతటి ప్రముఖ స్థానాన్ని సంపాదించి, ఇంతటి ఉన్నతస్థాయికి చేరుకున్నందుకు మేము వారికి సన్మానం చేస్తూ, వారికి 'ఉత్తరశ్రీ' అనే బిరుదు కూడా ఇవ్వాలనుకుంటున్నాం.

వెయ్యి కార్డుల దండ ఎందుకు వేశామనుకుంటున్నారు? ఆయన త్వరలోనే వెయ్యి ఉత్తరాలు వ్రాసి మా చేత మరో బిరుదు పొందాలని మా కోరిక!" ఆయన వేదిక దిగారు.

వెంటనే నన్ను మాట్లాడమన్నారు.

"ఈరోజు నిజంగా సుదినం! ఎందుకు..? ఒక రచయితకు సన్మానం! ఏ రచయితకు? నవలలు, కథలు రాసే రచయితకు కాదు, కవితలు వ్రాసే కవికీ కాదు. మరి? ఉత్తరాలు రాసే రచయితకు! ఉత్తరాలు వ్రాయడం మాత్రం ఎంత కష్టం అనుకుంటున్నారు? అసలు ఈ సభలో ఉన్నవాళ్ళు ఎంతమంది కార్డు మీద పెన్ను పెట్టి, పెన్ను దింపకుండా కార్డు నింపగలరు? ప్రశ్నిస్తున్నాను... చెప్పండి!

ఉత్తరాలు వ్రాయడం ఎంత కష్టం? కార్డు నిండా ఉత్తరం వ్రాయడం చాలా కష్టం! ఈ 'ఉత్తర రచన' ద్వారా 'గన్' చేస్తున్న సాహితీసేవ అపారం.

పత్రికలు అందరూ చదువుతారు. పత్రికల్లో చదివింది- 'బాగుంది, బాగాలేదు, ఎందుకు బాగుంది?, ఎందుకు బాగాలేదు?' అని తమ నిష్కల్మషమైన ఏ అభిప్రాయమైనా పత్రికలకు పనిగట్టుకొని తెలియచెయ్యాలని ఎంతమంది అనుకుంటారు? ఎంతమందికి ఇలాంటి ఉన్నతమైన 'స్పృహ' ఉంటుంది? ఇదే మా 'గన్'లోని ప్రత్యేకత!

ఈ ఉత్తర రచయిత త్వరలో 'సహస్ర ఉత్తరశ్రీ' అని బిరుదు అందుకోవాలని ఆకాంక్షిస్తూ... శెలవ్!" అని నా ఉపన్యాసం ముగించాను.

'ఉత్తరశ్రీ' బిరుద ప్రదానం ఘనంగా జరిగింది.

చివరగా- 'ఉత్తరశ్రీ... గన్' తన సందేశం వినిపించడానికి లేచాడు.

"అందరికీ నమస్కారం!

నన్ను ప్రోత్సహించి, ఈ సన్మాన సభ ఏర్పాటుచేసిన 'యువరసం' వారికి కృతజ్ఞతలు.

అసలు మొదటికి వద్దాం...

నా మొదటి ఉత్తరం అస్సాం సాహితీ పత్రికలో అచ్చయినపుడు వేదిక మీద వున్న వారు ( నన్ను చూపించి ) నన్ను ప్రోత్సహించారు. ఆ ప్రేరణతోనే నేను ఈనాడు 'ఉత్తరశ్రీ'ని కాగలిగాను.

మాములుగా కవిత, కథా రచయితలకు పత్రికలు పారితోషికం ఇస్తున్నట్లుగానే ఉత్తరాల రచయితలకు కూడా పారితోషికం ఇవ్వాలని నేను పత్రికలతో పోరాటం చేయాలనుకుంటున్నాను.

ఇది విని మీరు ఆశ్చర్యపోవద్దు. ఎందుకంటే... నాకు కొన్ని ఉత్తరాలకు 'ఉత్తమ ఉత్తరం' బహుమతులు వచ్చాయి. అలాంటప్పుడు- మాములు ఉత్తరాలకు కూడా పారితోషికం ఇస్తే బావుంటుంది కదా!

కవిత, కథ, నవలల రచనను సాహిత్యంలో ప్రక్రియలుగా గుర్తించినట్లుగా... పత్రికలకు రాసే ఈ 'ఉత్తరాల రచన'ను కూడా ఓ ప్రక్రియగా గుర్తించి 'ఉత్తరాల రచయిత'లకు కూడా పత్రికలు పారితోషికం అందజేసే దిశలో నా కృషిని కొనసాగిస్తానని ఈ సందర్భంలో తెలియజేసుకుంటున్నాను.

నేను త్వరలో 'ఉత్తర రచన శిక్షణ మరియు పరిశోధన కళాశాల' స్థాపించాలనుకుంటున్నాను. ఈ నిర్ణయం రేపటి నుండి అమలులోకి వస్తుంది. పత్రికలకు ఉత్తరాలు వ్రాసేవాళ్ళందరికీ నా ఆహ్వానం.

ఈ శుభసందర్భంలో నేను ఒక శుభవార్త చెప్పబోతున్నాను. నేను ఈమధ్యనే 'మినీ కవితలు' కూడా వ్రాయడం మొదలుపెట్టాను.

ఛందోబద్ధమైన పద్యాలు, వచన కవితలు, గేయ కవితలు, హైకూలు, నానీలు, మామీలు, కూమీలు, చప్రలు, చుక్కలు, రెక్కలు లాంటి ఎన్నో ప్రక్రియలు కవితాప్రపంచంలో వచ్చాయి. నేను వాటి జోలికి వెళ్లకుండా 'గన్‌లు' అనే కొత్త ప్రక్రియ కనుగొన్నాను. ఇది చదవగానే నిజమైన 'గన్' పేల్చినట్లుగా వుంటుంది.

మచ్చుకు రెండు 'గన్'లు వినండి...

'అదిగో చీర
ఇదిగో జాకెట్
అదిగదిగో జుట్టు
అమే... స్త్రీ !'

●

'సూర్యోదయం
ఎండోదయం
చంద్రోదయం
అదే... ప్రకృతి !'

సభలోని జనం ఇంక చాలని చప్పట్లు కొట్టసాగారు... 'గన్'ల తాకిడి తట్టుకోలేక!

నేను గన్ చొక్కా పట్టుకొని వెనక్కి లాగాను... కూర్చోమని!

"ఈ సభను జయప్రదం చేసిన మీ అందరికీ నా నమస్కారాలు!" అంటూ గన్ కూర్చున్నాడు.

'ఉత్తరశ్రీ' సన్మాన సభ ముగిసింది!

జనం వెళ్లిపోతూ "చాల్లేండి సంబడం! పెద్ద పెద్ద కావ్యాలు రాసినవాళ్ళకే గతి లేదు. వాళ్ళనే ఎవరూ పట్టించుకోవడం లేదు. కాని, ఉత్తరాల రచయితకు మాత్రం సన్మానం అట, మతి లేదు జనానికి!" అనుకుంటున్నారు.

ఉత్తరం వ్రాయడం అంటే ఎంత కష్టమో... ఈ జనానికేం తెలుసు?!

●

'వార్తాసాగరం' దినపత్రిక ... 2 మార్చి' నుండి 4 మార్చి' 2004 సంచికలలో ప్రచురితం